# తలుపు చప్పుడు

టక్ .... టక్ ....

తలుపు చప్పుడయింది....

వెంకటేశు గుండె ఆగినంత పనయింది.

కొంపదీసి మున్సిపాలిటీ వాడేమో బాత్‌రూం గోడ కూలిపోతే మళ్ళీ గోడ పెట్టడానికి ఇటుక తెప్పించాడు అదీ వెంకటేశు చేసిన తప్పు!

ఇటుక బండి అటు వెళ్ళిందో లేదో ఇటు నల్లరంగు మోటారు సైకిలు మీద ఓ నల్లనివాడు దిగనే దిగాడు. వాడు అంత సేపు ఆ బండి వెనకే తిరిగినట్టున్నాడు. కింద ఆహారాన్ని గమనిస్తే ఆకాశంలో గద్ద అలాగే తిరుగుతుంది.

బండి ఆ ఇంటి ముందు ఆగడం చూశాడు. అప్పుడేమన్లేదు. అటు ఇటు రెండు చక్కర్లు కొట్టివొచ్చాడు మోటారు సైకిలు మీద. వాడి సొమ్మేంపోయింది, అందులోని పెట్రోలు వాడి జీతం డబ్బుల్తో కొంటాడు గనకనా!

ఆ నల్ల సైకిలు మోటారు మీది మున్సిపాలిటీవాడు పోలీసు కంటె తక్కువేం కాదు. ఆ మాట కొస్తే ఎక్కువే. వాడికి తెలిసినన్ని కిటుకులు ఏ పోలీసు వాడికి తెలియవు. జేబులో దించుకోవడంలో మహా ఘటికుడు. ఇటుక దింపి బండి వెళ్ళేదాకా చూశాడు ముందుగా కమిట్ చేయించాలి కదా ఆ పైన రంగంలోకి దిగాడు.

వెంకటేశుకు ఇటువంటి వ్యవహారాలు కొత్త.

అతనికి పెళ్ళయి సంవత్సరం కాలేదు. భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది పురుడు పోసుకోడానికి. అప్పట్నించి ఒకటే భయం పట్టుకుంది వెంకటేశుకు ఇలా సంవత్సరానికో కాన్పయితే మూడేళ్ళలో తాను ముగ్గురు బిడ్డల తండ్రి అవుతాడు. హైద్రాబాద్ మహాపట్నంలో ముగ్గురు బిడ్డల్ని, ఇంటికయిన ముప్పైవేల అప్పును పోషించడమంటే మాటలా!

పెళ్ళయిన మూడు నెలలకే భార్య సిగ్గుపడుతూ చెవిలో ఆ వార్త వేసినప్పట్నించి వెంకటేశుకు భార్య అందాన్ని చూస్తే ఎలర్జీగా ఉంది. అక్కడికీ ఫ్యామిలీ ప్లానింగ్ మందులు మాత్రలంటూ గొణిగాడు కాని భార్య ససేమిరా విననంది. పిల్లలంటె తనకు ముచ్చటా అంది. కావాలంటె ఇద్దరో ముగ్గురో పుట్టగానే బుద్ధిగా ఆపరేషన్ చేయించుకుంటాను అంది. మధ్యలో ఆపేది లేదు అంది. వెంకటేశుకు అనడానికేముంది. ఏం లేదు తలూపేశాడు. ఆమె జబ్బల మీద నొక్కుల కేసి

చూశాడు ఎలర్జీ ఎగిరిపోయింది. నువ్వు దూకమంటె బావిలోకైనా దూకేస్తా అనేశాడు.

పెళ్ళికాగానే కొడుకు అద్దె ఇంట్లో ఇబ్బందిపడకూడదు. అదిగాక అప్పు అనే భూతం వెంట ఉంటే మగాడు హద్దుల్లో ఉంటాడు అనే లౌక్యంతో వెంకటేశు తండ్రి వెంకటేశుచేత ముప్పైవేల రూపాయల అప్పుచేయించి ఆ పాత ఇల్లు కొనిపించాడు. తాను తన భార్య కృష్ణా, రామా అనుకుంటూ ఊళ్ళో ఉన్నారు.

ఆ పాత ఇంట్లో కొత్త సంసారాన్ని పెట్టినప్పట్నుంచి మొదలయ్యాయి వెంకటేశుకు కష్టాలు. అప్పులవాడు వడ్డీ వసూలుకు వచ్చినట్లు ప్రతినెల ఫస్టు వచ్చేసరికి ఏదో రిపేరింగ్ రెడీగా ఉంటున్నది.

ఇంటిముందు వాళ్ళు కొత్తగా డాబా కట్టినందుకు వెంకటేశుకు జెలసీగా లేదు కాని అప్పట్నుంచి ఒక కొత్త ఇబ్బంది మొదలయింది. కప్పులేని బాత్‌రూంలో ఛస్తే స్నానంచేయనని భార్య భీష్మించుకకూర్చుంది. తప్పుతుందా ఆమె మెడలో మూడుముళ్ళు వేసినప్పుడే అప్పుల ముడి విప్పాడు. రెండొందలు అప్పుతెచ్చి బాత్‌రూం మీద రేకులు వేయించాడు. నిజం చెప్పొద్దూ భార్య మొండిదని తిట్టుకున్నాడు కాని....డాబా మీద కోతుల్ని గమనించాక ఆమె మొండితనాన్ని ఎంతో మెచ్చుకున్నాడు.

బాత్‌రూం మీద వేసిన రేకులు కొత్తవే కాని గోడలు పాతవి. రెండు నెలలు దాకా ఆ రేకుల్ని మోసి ఆపైన ఇక మావల్లకాదని ఒక గోడ ధామ్మని కూలిపోయింది. ఆ నష్టంలోని లాభం ఏవిటంటె ఆ గోడ వెంకటేశు భార్య పుట్టింటికి పోయాక కూలింది. లేకపోతే గోడ కట్టేదాకా స్నానం చేయను స్నానం చేసేదాకా వంట చేయను. వంట చేసేదాకా ఇంకేదో చేయను అనేది ఆమె. హడలిపోయేవాడు వెంకటేశు అందుకే భార్య పుట్టింటికిపోయాక కూలిన బాత్‌రూం గోడను చూసి శోకంలో శ్లోకంలా ఓ చిరునవ్వు నవ్వేశాడు.

రెండుకాదు మరో మూడు నెలలకు ఆ గోడ కట్టినా ఇబ్బందిలేదు.

ఆ మూడు నెలలు గిర్రున తిరిగిపోయాయి.

ఆ తలుపుచప్పుడు మూడునెలలకిందిదయితే వెంకటేశు గుండెమరోలా కొట్టుకునేది– అసలా చప్పుడుకోసం ఎంత ఎదురుచూశాడని

తలుపుచప్పుడయితేచాలు భార్య పుట్టింటి నుంచి టెలిగ్రామో, వార్తో అనుకునేవాడు– తనను తండ్రినిచేసే ఆ వార్తకోసం తహ తహ పడేవాడు– ఆ విధంగా మూన్నెళ్ళక్రితం ఆ తలుపుచప్పుడు సృష్టించిన త్రిల్ అంతా ఇంత కాదు–

సంవత్సరం క్రితమైతె తలుపు చప్పుడు కాగానే వెంకటేశుకు ఎక్కడలేని కోపమొచ్చేది. అవి తనకు పెళ్ళయిన తొలిరోజులు మరి....

ఇప్పుడు కోపంలేదు. ఆ త్రిల్ లేదు– భయం ఒకటే భయం పట్టుకుంది. తలుపుచప్పుడయితేచాలు ఏ మున్సిపాలిటివాడో నీటి పన్నువాడో వడ్డీకోసం వచ్చే

అప్పులవాడో. చిల్లరకొట్టువాడో, బట్టలషాపువాడో, పాలవాడో, ఇన్‌స్టాల్‌మెంట్ షాపువాడో అని హడలిపోతున్నాడు-

అందుకే ఆరోజు తలుపు చప్పుడు కాగానే గుండె ఆగినంతపనయింది వెంకటేశుకు.

మరోసారి అయితే భార్య పుట్టింటికి పోయినప్పుడు తలుపు చప్పుడయితే ఆమె అకస్మాత్తుగా పుట్టింటి నుంచి వచ్చిందేమోనని అతని గుండె ఆనందంతో.... పట్టరాని ఆనందంతో వణికిపోయేది....

ఇప్పుడా తలుపు చప్పుడు భార్య చేసిందే అయినా అతనికి భయంగానే వుంది. బాత్‌రూం గోడ ఇంకా పూర్తి కాలేదు.

భార్య మరో పది రోజులకు వస్తుందనగా బాత్‌రూం గోడ పనికి పూనుకున్నాడు-బండివాడు ఇటుకపోసి పోగానే మున్సిపాలిటీవాడు తలుపు ముందు ప్రత్యక్షమయ్యాడు-

ఆ చుట్టాన్ని ఎప్పుడూ చూడలేదు వెంకటేశు. చిర్నవ్వుతో ఆహ్వానించి చల్లని మంచినీరు ... తేనీరు ఇద్దామనుకున్నాడు.

వాడికి లంచాలు ఇచ్చేవాళ్ళంతా తాంబూలాల్లో పెట్టి మరీ ఇస్తారేమో మున్సిపాలిటీవాడు గారపట్టిన పళ్ళతో ఒకసారి ఇకిలించి........

"ఏ ఇట్కా కిస్ కా హై...." అన్నాడు........మున్సిపాలిటీ వాళ్ళకూ్కడా ఒక ప్రత్యేకమైన బాష వుంది మరి ...

"మాదేనండి ఇప్పుడే తెప్పించాను" అన్నాడు వెంకటేశు.

"ఎందుకు ?..." అని ప్రశ్నించాడు మున్సిపాలిటీవాడు- అతను మున్సిపాలిటీయుడని వెంకటేశుకు తెలియదు,

అద్దె ఇంటి కోసం వచ్చాడేమో అనుకున్నాడు.

"అబ్బే గదులు కట్టూలేమండి-బాత్‌రూం గోడకూలిపోతే కట్టిస్తున్నా-" అన్నాడు.

"ఎలా కట్టిసున్నావ్"

ఇదెక్కడి పీడరాబాబు....ఎంతో పరిచయం ఉన్నట్లు ఏకవచనం ప్రయోగిస్తున్నాడు-అసలు వీడెవ్వడు బాత్‌రూంగోడ ఎలా కట్టిస్తున్నావు అని అడుగుతున్నాడు.

"సిమెంటు, ఇసుక....తగిన నిష్పత్తిలో కలిపి...."

"అదికాదు/నీకు బాత్‌రూం గోడ కట్టడానికి పర్మిషన్ ఉందా ?"

"పర్మిషనా !" తల గిర్రున తిరిగినట్లయింది వెంకటేశుకు - తన ఇంట్లో బాత్‌రూం గోడ పడిపోతే తిరిగి కట్టుకోవడానికి ఎవరి పర్మిషన్ తీసుకోవాలి-

"ఈ ఇంటికి ప్లానుందా ?"

అప్పుడర్థమయింది వెంకటేశుకు అతడు మున్సిపాలిటీ తాలూకు అని-

"పాత ఇల్లుసార్....ఇప్పటిదా....ఎప్పటిదో నేను కొని సంవత్సరమయింది అంతే...."

"ఊహూ....రిజిష్టర్ కాగితాలున్నాయా ?"

"ఉన్నాయి సార్ "

"ఇంటి పన్ను ఈ ఏడాద్ది కట్టినవా ?"

"కడ్తసార్....మొన్ననేకదా ఇల్లుకొన్నాను. అప్పటిదాకా వున్న డ్యూస్ క్లియర్ చేశాం .. ఈ సంవత్సరం పన్నే కట్టాలి-కొంచెం ఇబ్బందుల్లో ఉన్నా న్సార్....కడ్తాను...."

"ఉహూ....అది మాకు అవసరంలేదు. బాత్‌రూంకు ప్లాను, పర్మిషన్ ఉన్నాయా ?"

"పాత బాత్‌రూమే కదాసార్-దాని జాగలోనే గోడపడిపోతె గోడ పెడ్తున్నాం సార్ - కొత్తగా ఏమీ కట్టడంలేదు సార్...."

"నహీ నహీ....అదంతా మాకు తెల్వదు-మున్సిపాలిటీ పర్మిషన్ లేకుండా ఒక ఇటుక పెల్లకూడా ఇంట్లో పెట్టడానికి వీల్లేదు"

"అట్లనాసార్....అయితే పర్మిషన్ తీసుకుంటాసార్...." అమాయకంగా అన్నాడు వెంకటేశు-

"పర్మిషన్‌కు ఎంత ఖర్చు అవుతుందో తెలుసా ?"

"ఎంతవుతుందిసార్ ?"

"రెండు వేలు కావాలి-"

మూర్ఛవచ్చినంత పనయింది వెంకటేశుకు-బాత్‌రూం గోడ కట్టడానికి పర్మిషన్ కావాలంటే రెండువేలు ఖర్చవుతుందా ? బాత్‌రూం అనేది అంత లగ్జరీ కట్టడమా ?

వెంకటేశు నీళ్లు మింగడం చూసిన మున్సిపాలిటీవాడు ఎంతో సంతోషించాడు.

అలా నీళ్లు మింగించడం వాడికి సరదా అని కాదు-లాభం.

ఆ మున్సిపాలిటీవాడి వెంట వచ్చిన ఒక వ్యక్తి వెంకటేశును పక్కకు తీసుకుపోయి చెవిలో ఏదో చెప్పాడు-

వెంకటేశు ఆ విషయంలో ఎడ్యుకేట్ అవుతున్నందుకు మున్సిపాలిటీవాడు ఎంతో సంతోషించాడు.

ఎడ్యుకేటయి వచ్చిన వెంకటేశు సార్ ప్లీజ్ వందరూపాయలు ఇచ్చుకుంటాను మామూలు ఉద్యోగిని సార్ గవర్నమెంటు ఉద్యోగిని కాను సార్ అంటూ బతిమలాడాడు.

పంద అంటె రెండు పందలు. రెండువందలు అంటె నాలుగువందలు అడుగుతారు.

అలా మున్సిపాలిటీ వాళ్ళకు కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్న విషయం వెంకటేశు కు ఇంకా తెలియదు.

పందరూపాయలా ! నహీ

సార్ ప్లీజ్ సార్

అచ్ఛా ఆఖరి మాట రెండొందలు ఇచ్చేయి గమ్మున ఊర్కుంటం.

సార్ దీనంగా చూశాడు వెంకటేశు.

ఇంకేం మాట్లాడకు అప్పుల వాడు కూడా అంత కఠినంగా ప్రవర్తించడు. కఠినంగా అన్నాడు మున్సిపాలిటీవాడు.

ఇంకేం మాట్లాడలేదు వెంకటేశు.

"ఊ. తేపో" అన్నాడు మున్సిపాలిటీవాడు.

"ఇప్పుడాసార్?...."

"ఊ మరెప్పుడు?"

"వచ్చే ఫస్టుకు"

"అలా కుదురది ఇప్పుడెంతుంటె అంత ఇయ్యి"

"ఫస్టుకు ఇస్తా సార్ ...."

"అట్ల కుదురదని బోల్తానగదా ఇటువంటి పన్లు ఆలస్యంచేయొద్దు తేపో"

లోపలికివచ్చి పేంటుజేబు, సూట్‌కేస్ వెదికితె యాభై అయిదు రూపాయలు దొరికాయి

యాభై రూపాయలు సమర్పించుకున్నాడు.

రెండు రోజుల్లో వస్తా మిగతా పైసలు సిద్ధంచేసి ఉంచు అని చెప్పి బందిపోటు గుర్రం ఎక్కినట్లు నల్లన మోటర్‌సైకిలు ఎక్కి వెళ్ళిపోయాడు మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్.

మరో అరగంటలో మళ్ళీ తలుపు చప్పుడయింది.

వెంకటేశు గుండె చప్పుడు ఎక్కువయింది.

"ఈ ఇటుక ఎవరిది?"

గతుక్కుమన్నాడు వెంకటేశు.

ఈ ప్రశ్నవేసే హక్కు ఎందరికుందో కదా!

"మాదేనండి"

"ఇలా రోడ్డుమీద పోయకూడదు"

"రోడ్డుమీద కాదు గదా సార్ రోడ్డు ప్రక్కన మా ఇంటిముందే పోసుకున్నాం కదా"

''అదికూడా రోడ్డుకిందే లెక్క. పర్మిషన్ ఉందా?"

"పర్మిషనా! "

''అవును రోడ్డుమీద ఇటుక పోయడానికి పర్మిషన్ ఉందా?"

"రోడ్డుమీద పోయలేదు సార్...."

''ఇదంతా రోడ్డుకిందకే వస్తుందని చెబ్తుంటె నీక్కాదు. ఇక్కడ ఇటుక, ఇసుక, కంకర పోయకూడదు"

మరెక్కడ పోసుకోవాలి ఇంటిముందు పోసుకోవడంకూడా తప్పేనా

''మా ఇన్స్పెక్టర్ వస్తే జరిమానా వేస్తాడు కానా ఖర్చు అవుద్ది"

అదిరిపడ్డాడు వెంకటేశు.

"ఇందాకా వచ్చివెళ్ళాడు కదా" అన్నాడు తేరుకొని.

''ఆయన వేరే. ఆయన ఇంటి ప్లాన్ల ఇన్స్పెక్టర్ మా ఇన్స్పెక్టర్ రోడ్ల ఇన్స్పెక్టర్.

పోలీస్ డిపార్ట్మెంట్లోనైనా లేరేమో ఇన్ని రకాల ఇన్స్పెక్టర్లు.

''ఇరవై రూపాయలు ఇచ్చుకుంటానుసార్ ఆ ఇన్స్పెక్టర్ ఇటు రాకుండా చూడండి".

పళ్ళు పటపట కొరికినంత పని చేశాడు ఆ రెండవ మున్సిపాలిటీ శాస్త్రి.

"ఇరవై రూపాయలా!.... ఇదేమన్న బిచ్చమనుకున్నావా?"

కాకపోతె మరేంటో ! !

"ఏదో చిన్న ఉద్యోగిని సార్ మొన్నటి వర్షానికి బాత్రూంగోడ కూలిపోతె కట్టుకుంటున్నా సార్.... దయచేసి అంతటితో సరిపెట్టుకోండిసార్....

"వీల్లేదు వంద రూపాయలు ఇచ్చేదాకా కదలను."

వెనకట విఠలాచార్య సినిమాల్లో రాజభటులు పన్నులు కట్టమని ప్రజల్ని పీడిస్తుంటే ముసుగు వీరులొచ్చి ఆ రాజభటుల్ని చితకగొట్టి ప్రజల్ని రక్షించేవాళ్ళు.

అలాంటి ముసుగు వీరుడెవడైనా ఆ మున్సిపాలిటీవాణ్ని చితకగొడితె బాగుండునని అటు ఇటు చూశాడు వెంకటేశు.

ముసుగు వీరుడు కాదుకదా అప్పటిదాకా మొరిగిన కుక్కపిల్ల కూడా అక్కణ్నుంచి మాయమయింది మున్సిపాలిటీవాణ్ని చూసి.

"ఇరవై అయిదుకంటె ఎక్కువ ఇచ్చుకోలేను సార్...." దీనంగా అన్నాడు వెంకటేశు.

అత్తగారిసొమ్ము కాజేసే దర్జా దొంగ అయిన అల్లుడిలా నిల్చున్నాడు ఆ మున్సిపాలిటీవాడు

"లాస్ట్మాట చెప్తాన- యాభై ఇవ్వు ఇంక మాట్లాడకు అంతకంటె తక్కువ తీసుకునేది లేదు.

ఇస్తానన్నట్లు తలూపాడు వెంకటేశు.

కథా నిలయం
1378
శ్రీకాకుళం

"తే మరి "

"ఇప్పుడా సార్?"

"ఆ...."

"ఫస్ట్‌స్త్రా సార్"

"నువ్వెక్కడ దొరికినవయ్యా పొద్దున్నే బోణీ...." దేవుని పటానికూడా మొక్కుకొని వొచ్చాడేమో ఆరోజు లంచాలు బాగా దొరకాలని.

"సరే నీదేబోణి ఎంతుంటె అంత ఇవ్వు" అన్నాడు తిరిగి ఆ మున్సిపాలిటీవాడు.

"ఐదు రూపాయలున్నాయిసార్ అంతే"

"సరే తే"

ఆ అయిదు రూపాయల్ని గద్ద గారెముక్కను తన్నుకపోయినట్లు అందుకపోయాడు మున్సిపాలిటీవాడు.

బాత్‌రూం గోడ అనేది భయంకరంగా కనిపించసాగింది వెంకటేశుకు.

మరునాడు పొద్దున ఆఫీసుకు తయారవుతున్నాడు.

టక్ ....టక్ .... తలుపు చప్పుడయింది.

ముచ్చెమటలు పోశాయి. దగ్గరలో తువ్వాలు లేదు జేబులో కర్చీఫ్‌లేదు దండెంమీద భార్య జాకెట్ ఉంది. గబగబా మొహం తుడుచుకున్నాడు దాంతో.

"కోన్ హై అందర్? ...."

బయటికి తొంగిచూస్తె స్కూటర్‌తో సహా ఒక మనిషి కనిపించాడు.

రాత్రంతా ఒకటే పీడకల యముడు దున్నపోతు ఎక్కడం మాని స్కూటర్లు, సల్లని సైకిలు మోటార్లు ఎక్కినట్లు విష్ణుమూర్తి దశావతారాల్లా, యముడు మున్సిపాలిటీ ఇన్స్పెక్టర్ల అవతారాలు ఎత్తినట్లు....

బాత్‌రూం గోడ దేవుడెరుగు ఇంటిముందు పోసిన ఇటుకను ఎవరికైనా ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు వెంకటేశు.

తాను తొంగిచూడటం పసిగట్టిన స్కూటర్ మనిషి స్కూటర్ తాళాలు తీసుకొని సరాసరి తలుపు తోసుకొని లోపలికి వచ్చాడు.

''ఈ ఇంటి ఓనర్ ఎవరు?

ఖచ్చితంగా ఇది మున్సిపాలిటీ గొంతే-

"నేనేసార్...." దిగాలుగా చూశాడు వెంకటేశు-

"పన్ను బకాయి ఉందట? ..."

"ఒక్క సంవత్సరానిదే సార్ ...ఇబ్బందుల్లో ఉన్నా సార్-జెర చేయితిప్పుకున్నాక కడ్తా సార్."

"ఇదివరకు ఎంత పన్ను కట్టారు?"

"ఆరునెల్లకు ముప్పయి రూపాయలట సార్-పాత ఓనర్ చెప్పాడు.

"పీల్లేదు-రివాల్యూ చేయాల్సిందే. ఇంత ఇల్లుకు ముప్పై రూపాయల పన్నా ....నువ్వు అంతే కడ్తాననుకుంటున్నావా ?"

"అంతే కదా సార్"

"నహీ, నహీం....ఈ ఇల్లు అద్దెకిస్తే ఎంతవస్తుందో తెలుసా-నాలుగు వందలు అంటె సంవత్సరానికి నాలుగువేల ఎనిమిది వందలు అందులో ఇరవై ఐదు శాతం పన్నెండు వందలు....పన్నెండు వందల రూపాయల పన్ను కట్టాలి సంవత్సరానికి"

ఓరినాయనో....నెలకు వంద రూపాయల పన్నా! ఇంతకంటె అద్దెఇల్లు నయంకదా నాయనా- నాచేత ఇల్లెందుకు కొనిపించావు.

....ఏ కోపంతో నన్ని శిక్షకు గురిచేశావు.... మీరు నిర్ణయించిన అమ్మాయినే బుద్ధిగా పెళ్లి చేసుకున్నాను కదా....ఎన్నడూ మీ మాటకు ఎదురు చెప్పలేదు కదా. అని కాస్సేపు వాపోయాడు వెంకటేశు.

అద్దె ఇల్లే సుఖంకదా. అద్దె ఇంటివాళ్ళకు మున్సిపాలిటీ యమబాధ ఉండదు కదా....

"బోలో....పన్నెండు వందలు పన్ను కట్టాలి-తెల్సిందా."

కాళ్ళలో ప్రారంభమైన వణుకు వొళ్ళంతా వ్యాపించింది వెంకటేశుకు-

"అంతపన్నా సార్...."

"ఆఁ మరేమనుకున్నావ్? -మళ్ళా మాట్లాడ్తె స్పెషల్ పన్నుకూడా తగులుద్ది"

"ఆఁ! "

వెంకటేశు హార్ట్ ఆగబోయి అతని భార్య మాంగల్యం గట్టిదవడం చేత మళ్ళీ కొట్టుకో సాగింది.

వెంకటేశు దెబ్బ తగిలిన కుందేలు పిల్లలా గిలగిలా కొట్టుకోవడం చూసి ఆ మున్సిపాలిటీ పన్నుల ఇన్స్పెక్టర్ మురిసిపోయాడు - ఎంతో ముచ్చటపడ్డాడు.

"ప్రతిసారి పన్నెండు వందల పన్ను కడ్తావా....నూరుకో లేక అరవైకో తగ్గించమంటావా ?....

ఆశగా చూశాడు వెంకటేశు.

"వేయి రూపాయలు ఇచ్చుకో-నీ ఇంటి పన్ను ఇప్పుడు ఎంత ఉందో అంతే ఉండేట్టు చేస్తా....చూశావా నీకెంత లాభమో - ఒక్కసారి వేయి రూపాయలు ఇస్తే ప్రతిసారి పన్నెండు వందలు కట్టడం నీకు తప్పుతుంది అరవయో నూరో కడ్తావు అంతే-జస్ట్....ఒక్క వేయి రూపాయలు అంతే-ఇంకా ఎక్కువనే అడగాలి-పోనీ అని తక్కువ అడిగాను.

కళ్ళు గిర్రున తిరిగి పొద్దున్నే ఆకాశంలో చుక్కలు కనిపించసాగాయి వెంకటేశుకు-

సొంత ఇండ్లు ఉన్నవాళ్లు మున్సిపాలిటీ వాళ్ళ పాలిటి పాడి ఆవులు-

"వొంద రూపాయలు ఇచ్చుకుంటాను సార్ ...."

పురుగును చూసినట్టు చూశాడు వెంకటేశును పన్నుల ఇన్స్పెక్టర్ తన తాహతుకు తగిన లంచమా అది-

అసలే ఎర్రని కళ్ళు రక్తంలో మునిగినట్లు మరింత ఎరుపెక్కి- "పో- పన్నెండు వందలు పన్ను కట్టు నాకేంది! ..." అన్నాడు.

"సార్-ప్లీజ్ సార్ అంత పన్ను కట్టలేనుసార్.... వెళ్ళిపోబోతున్న ఇన్స్పెక్టర్‌కు అడ్డం వెళ్ళాడు వెంకటేశు-

"అయితే ఒక్కసారి కట్టే పన్ను పన్నెండు వందలు మా బిల్ కలెక్టరు వస్తాడు అతనికి ఇచ్చేయి-నీ ఇంటి పన్ను ఎప్పటిలాగే ఉంటుంది!"

"మూడొందలు ఇస్తానుసార్.... ప్లీజ్....

"ఉహుఁ...." కోపంగా చూశాడు ఇన్స్పెక్టర్.

"నాలుగు వందలు సార్ ...

"లాస్ట్‌మాట చెబ్తున్నా-ఎనిమిది వందలు ఇచ్చేయ్-ఇహ మాట్లాడకు-మాబిల్ కలెక్టర్ వొస్తాడు. అతనికివ్వు-" అనేసి ఆ యముడు స్కూటరెక్కి వెళ్ళి పోయాడు.

అప్పట్నించి తలుపు చప్పుడయితే చాలు హడలిపోతున్నాడు వెంకటేశు. మున్సిపాలిటీ బిల్‌కలెక్టర్ కాబోలు.... ఎనిమిది వందలు తెమ్మని కూర్చుంటె ఎక్కణ్నుంచి తెస్తాడు.

నిన్ననే వడ్డీ వ్యాపారి చమన్‌లాల్ వచ్చి రేడియో, సైకిలు ఎప్పుడు విడి పించుకపోతావు అని అడిగాడు-

తన భార్య ప్రసవించిన సంగతి కొడుకు పుట్టిన సంగతి.... అత్తగారింటికి పోవడంతో ఖర్చయిన సంగతి చెప్పాడు- రెండు నెలల్లో విడిపించుకుంటాను అని బతిమలాడాడు.

చమన్‌లాల్ సంతోషించాడు.

వెంకటేశుల్లాంటి వాళ్ళ భార్యలు ప్రసవించడం వడ్డీవ్యాపారి చమన్‌లాల్ లకు ఎంతో సంతోషకరమైన విషయం. ఇటువంటి కేసుల్తోనే వాళ్ళ వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలు అవుతుంది. అందుకే ఫ్యామిలీ ప్లానింగ్ డిపార్ట్ మెంట్ అంటే వాళ్ళకు ఒళ్ళుమంట.

"రెండు రోజుల్లో వడ్డీకట్టు-అసలు తీరిగ్గా ఇద్దువులే-" అన్నాడు.

ఆ రెండు రోజుల గడువు తీరింది-

వెంకటేశుకు కొత్త అప్పు పుట్టలేదు.

ఆ తలుపు చప్పుడు వడ్డీ వ్యాపారి చమన్‌లాలో లేక అతని నౌకరో చేసింది కాదుగదా.

కిరాణకొట్టు రామిశెట్టికి రెండు నెలల బాకీ ఉంది- అతడే వొచ్చాడేమో-

ఆ తలుపు చప్పుడు గుండెలో గుబులు రేపింది. వెంకటేశు ప్రాణాలను తోడేస్తున్నది.

ఇల్లుకొన్న కొత్తలో తలుపు చప్పుడయితే ఎంత గర్వంగా ఉండేదని.... అది తన సొంత ఇల్లు అని ప్రతిసారి ఆ చప్పుడు గుర్తుచేసేది తనో ఇంటి యాజమాని అని ఎంతో పొంగి పోయేవాడు.

ఇప్పుడు తలుపు చప్పుడయితే చాలు కుంగిపోతున్నాడు. తెలిసినవాళ్ళు అందుకే "ఏమోయ్ ఎంకటేశూ నువ్వు రోజు రోజుకు పొట్టిగవుతున్నావేం. నీ ప్యాంటు నేలకు రాక్కుపోతున్నది...." అంటున్నారు.

మళ్ళీ తలుపు చప్పుడయింది.

కిర్ర్ కిర్....తలుపును తాకుతున్నట్టు చప్పుడు ...

ఎవరో ?

మున్సిపాలిటీ ఇన్స్పెక్టరో ....

బిల్ కలెక్టరో....

వడ్డీ వ్యాపారో....

కిరాణ కొట్టువాడో....

తుపానులో చిక్కుకున్న తీగెలా వణికిపోయాడు వెంకటేశు-

అది ఏ పిల్లి చేసిన చప్పుడో అయితే ఎంత బాగుంటుంది. కుక్క చేసిన చప్పుడైనా సంతోషించడానికి సిద్ధంగా ఉన్నాడు వెంకటేశు.

ఆ ఆశతో తలుపు చప్పుడు ఎందుకయిందో తెలుసుకోడానికి రెండడుగులు వేసినా యముల లిస్ట్ గుర్తుకొచ్చి భయంతో అడుగులు పడటంలేదు.

నరాల్లో ఏ మూల ఇంకిపోయిందో కాని ఎంత కూడదీసుకుందామన్నా ధైర్యం రావటంలేదు వెంకటేశుకు.

ఆ క్షణంలో తనను ఆదుకునే దేవుడెవరోనని భార్య పూజచేసే అన్ని పటాలను మొక్కుకున్నాడు.

కిర్....కిర్....

మళ్ళీ తలుపు చప్పుడు. భయంకరమైన రణభేరిలా ఉంది వెంకటేశు చెవులకు ఆ చప్పుడు. అతని గుండె అదిరింది....క్రాఫ్ చెదిరింది. స్వేదజలం తలనుండి బయలుదేరింది-

బాధగా కళ్ళు మూసుకున్నాడు....

అంత బాధెందుకు ఏ కుక్కో పిల్లో కావచ్చు కదా.... అంత అత్యాశా.... యములేనేమో।....

ఎవరైనా తలుపు తెరవక తప్పదు....
భయం భయంగా అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు.... తలుపులు తెరిచాడు....

బయటికి తొంగి చూశాడు—

ఆ తలుపు చప్పుడు....

ఆ తలుపు చప్పుడు....

ఆ తలుపు చప్పుడు....

తన ఇంటి తలుపు చప్పుడు కాదు.... పక్కింటి వాళ్ళ తలుపు చప్పుడని తెలుసుకొని వెంకటేశులోని మధ్య తరగతి జీవుడు "హమ్మయ్య" అని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు....!!

(మయూరి వీక్లీ - 31-1-86)